క్లుప్తంగా


ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

వేములపల్లి: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల గడువును గురువారం వరకు పొడిగించినట్లు రావులపెంట హైస్కూల్ హెచ్ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ భూక్యా లక్ష్మణ్‌నాయక్, సహాయ కోఆర్డినేటర్ నల్లమేకల వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యలో చదువు మానేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా తమ విద్యను కొనసాగించవచ్చని సూచించారు. పదో తరగతిలో ప్రవేశాలకు రికార్డ్ షీట్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటో, ఇంటర్‌లో అడ్మిషన్ కొరకు పదో తరగతి టీసీ, మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9951190467 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

మాడుగులపల్లి: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రొండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మాడుగులపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన పంచాయతీ కార్మికుల సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు సకాలంలో వేతనాలు అందేలా సర్పంచులు, కార్యదర్శులు చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండేటి నర్సయ్య, కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనర్సు, నాగరాజు, సహాయ కార్యదర్శులుగా యాదమ్మ, రవీందర్‌తోపాటు సభ్యులుగా రాజశేఖర్‌రెడ్డి, గణేష సైదులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సునీత, వెంకన్న, నాగరాజు, రవి. జానయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర ఎంపీడీఓగా లక్ష్మి


బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మి

పెద్దవూర: పెద్దవూర మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా మంగళవారం గోర్ల లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన రమేష్ దీన్‌దయాళ్ ఇటీవల బదిలీపై నకిరేకల్‌కు వెళ్లారు. దీంతో ఇన్నిరోజులు పెద్దవూర ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎంపీఓ కూస్‌రెడ్డి విజయకుమారి వ్యవహరించారు. ఆమె స్థానంలో అనుముల మండల ఎంపీడీఓగా పనిచేస్తున్న లక్ష్మి డిప్యూటేషన్‌పై పెద్దవూరకు వచ్చారు. లక్ష్మి గతంలో పెద్దవూర ఎంపీఓగా కూడా పనిచేశారు.

మంత్రి సీతక్కకు వినతి


సీతక్కకు వినతి పత్రం ఇస్తున్న లింగంగౌడ్

మిర్యాలగూడ టౌన్: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ బిల్లులను చెల్లించాలని కోరుతూ మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ.. సర్పంచులు అప్పులు తీసుకొచ్చి మరీ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడితే గత ప్రభుత్వం కనీసం నిధులు కూడా విడుదల చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఆయన వెంట ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడే సాహెబ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

'చలో పార్లమెంట్'ను విజయవంతం చేయాలి

డిండి: జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12, 16వ తేదీల్లో లౌకిక విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు సూరగి వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం డిండి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జోసెఫ్, భాను, జావెద్, చరణ్, సైదులు, మేఘన తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని షాబునగర్‌లో గల తన నివాసంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ మంగళవారం పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన గార్లపాటి ఉమాకర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరునగరు భార్గవ్ మాట్లాడుతూ.. గార్లపాటి ఉమాకర్‌రెడ్డి ఉపాధ్యాయుల సమస్యలతో పాటు విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ వనం మదన్‌మోహన్, గౌంగటి సైదిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులున్నారు.


ఉమాకర్‌రెడ్డిని సన్మానించిన మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్

నియామకాలకే పరిమితమైన కమిటీలు

- కానరాని ప్రజల భాగస్వామ్యం
- పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- పట్టించుకోని పాలకులు


పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

పెద్దవూర: ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను సక్రమంగా నిర్వహించేందుకు, వ్యవసాయంలో సాంకేతికతను ప్రోత్సహించేందుకు, పల్లెలు, పట్టణాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజా పంపిణీ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యావేత్తలు, వివిధ నిపుణులతో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేస్తున్న కమిటీలు కేవలం నియామకాలకే పరిమితమవుతున్నాయి. నిబంధనల ప్రకారం సభ్యులను నియమిస్తున్నా, కమిటీ కార్యకలాపాలు మాత్రం కాగితాలకే పరిమితమవుతున్నాయి. నెలల తరబడి సమావేశాలు జరపకపోవడంతో ఆయా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

పేరుకే పాఠశాల యాజమాన్య కమిటీలు..

విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లు నామమాత్రంగా మారాయి. ఏటా పాఠశాల ప్రారంభంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి కమిటీ సభ్యులను ఎన్నుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఈ కమిటీలు ప్రతినెలా తప్పకుండా సమావేశం కావాలి. పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాధిస్తున్న ఫలితాలపై సమీక్ష నిర్వహించాలి. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఆయా సమస్యల పరిష్కారానికి, వసతుల కల్పనకు, ఫలితాల పెంపునకు కృషిచేయాలి. కానీ ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు. చాలా పాఠశాలల్లో ఏడాదిలో ఒకసారి కూడా ఎస్ఎంసీ సమావేశాలు జరగడం లేదు.

పత్తాలేని వ్యవసాయ సాంకేతిక కమిటీలు..

వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, మత్స్యశాఖలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం గతంలో సాంకేతిక వ్యవసాయ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసింది. ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో వ్యవసాయంలో సాంకేతికతకు రైతులను ఆధునిక సాగు వైపు మళ్లించేందుకు ఈ కమిటీలు కృషి చేయాలి. అప్పట్లో ఈ కమిటీల్లో నియోజకవర్గ స్థాయి ఉత్తమ రైతులను సభ్యులుగా చేర్చారు. కానీ ప్రస్తుతం ఈ కమిటీలు ఎక్కడా కూడా పనిచేస్తున్న దాఖలాలు లేవు.

ఆస్పత్రి సలహా సంఘాలు నామమాత్రం..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మండల, పట్టణ, జిల్లా స్థాయి దవాఖానాల్లో ఆసుపత్రి సలహా సంఘాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులను నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. మండల పరిధిలో ఎంపీపీ, ఏరియా ఆసుపత్రుల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ కమిటీలు కొనసాగాలి. కానీ మండల పరిధిలోని ఆసుపత్రులలో కమిటీలు నామమాత్రంగా తయారయ్యాయి. సమావేశాలు జరగకపోవడంతో ఆసుపత్రుల నిధులు, వాటి ఖర్చు తీరుతెన్నులను, అక్కడి సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. ఏరియా ఆసుపత్రుల్లో సైతం ఆసుపత్రి సలహా సంఘాల సమావేశాలు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. చాలాచోట్ల సమావేశం జరిగినట్లు సంతకాలు తీసుకొని ఖర్చు లెక్కలకు ఆమోద ముద్ర వేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిటీ చైర్మన్లు, సలహా మండలి సభ్యులు ఆసుపత్రిపై, వైద్యులపై పెత్తనానికి పరిమితమవుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి తప్ప సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ఆహార సలహా సంఘాలదీ ఇదే పరిస్థితి

పేదలకు నిత్యావసర సరుకులు ప్రతినెలా క్రమం తప్పకుండా అందేలా చూసేందుకు ఆహార సలహా సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అక్రమాలు జరగకుండా ఈ కమిటీ నిరంతరం పర్యవేక్షించాలి. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీల నాయకులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో సలహా సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ సంఘం మూడు నెలలకు ఒకసారి సమావేశమై ప్రజా పంపిణీ వ్యవస్థ తీరుతెన్నులపై చర్చించాలి. ప్రస్తుతం ఈ సంఘాలు ఎక్కడా సమావేశం కావడం లేదు, మండలంలో తహసీల్దార్లు బదిలీ అయితే కొత్తగా వచ్చిన తహసీల్దార్లు నాయకులను, రేషన్ డీలర్లను కార్యాలయానికి పిలిపించుకొని కొద్దిసేపు తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించి పూర్తయినట్లు చూపుతున్నారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి



ప్రభుత్వ పథకాలు పక్కదారి పట్టకుండా, పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందేలా ఏర్పాటు చేసిన కమిటీలు సక్రమంగా విధులు నిర్వర్తించేలా చూడాల్సిన బాధ్యత పాలకులు, ఉన్నతాధికారులపై ఉంది. కమిటీలు పక్కాగా పనిచేస్తే అవినీతి, అక్రమాలకు తావులేకుండా ఉంటుంది. ఇన్ని కమిటీలు ఉంటాయన్న సంగతి చాలామందికి తెలియదు. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలైనా ఈ కమిటీలపై ఓ కన్నేసి చూడాలి.

– రమావత్ సక్రునాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నోముల నర్సింహయ్యకు ఘన నివాళి


నిడమనూరు: నోముల నర్సింహయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నోముల భగత్ తదితరులు


హాలియా: నోముల నర్సింహయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య 68వ జయంతి వేడుకలను మంగళవారం హాలియా పట్టణంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నర్సింహయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, కౌన్సిలర్ నల్లబోతు వెంకటయ్య, మాజీ ఎంపీపీ ఏడుకొండలు, నాయకులు పోశం శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పాదిల శ్రీనివాస్, సురభి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్‌లో..

నాగార్జునసాగర్: నోముల నర్సింహయ్య జయంతి సందర్భంగా నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో నెహ్రూ పార్కులో గల ఆయన విగ్రహానికి ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిలిటీ వైస్ చైర్మన్ బిన్నీ, పెద్దవూర మండల పార్టీ అధ్యక్షుడు జటావత్ రవినాయక్, టౌన్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూషరాజులు కృష్ణ, చంద్రయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి (నాగార్జునసాగర్): నోముల నర్సింహయ్య 68వ జయంతి సందర్భంగా తిరుమలగిరి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చవ్వా నాసర్‌రెడ్డి, రమేష్‌నాయక్, పగడాల పెద్దిరాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: నోముల నర్సింహయ్య జయంతి సందర్భంగా మంగళవారం నిడమనూరు మండలంలోని వేంపాడ్ స్టేజీ వద్ద గల ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా దివంగత ఎమ్మెల్యే గుండెబోయిన రామ్మూర్తియాదవ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఎంపీపీ జయమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్లు మర్ల చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, సంపత్, తాటి సత్యపాల్, రవినాయక్, రామలింయ్య, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, భిక్షానాయక్, బొల్లం రవి, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న టీఎస్ఎంఈఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నఫీస్ అహ్మద్

మిర్యాలగూడ: మైనార్టీ ఉద్యోగుల అభ్యున్నతికి తెలంగాణ మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్(టీఎస్ఎంఈఎస్ఏ) కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి నఫీస్ అహ్మద్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ కైరలీ పాఠశాలలో సంఘం మండల అధ్యక్షుడు జానిపాషా, కార్యదర్శి అజీమొద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సంఘం డివిజన్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మైనార్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే బాధ్యత సంఘం తీసుకుంటుందన్నారు. ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండీ అలీం, దస్తగిరి, మహమూద్‌అలీ, సాజిద్‌అలీ, నుస్రత్‌అలీ, అమీనొద్దీన్, జాన్ మొహమ్మద్, సమీర్ అహ్మద్, గులాం అహ్మద్, మక్బూల్ అహ్మద్, అహ్మద్ హుస్సేన్, ఫాతిమా, మెహ్రూన్నీసా, వహీదా, తస్లీమ్, రియాజ్, మహబూబ్, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి

పెద్దవూర: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని ఏఎంఓ రామచంద్రయ్య అన్నారు. మంగళవారం పెద్దవూర మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి స్కూల్‌లో పేరెంట్ సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించి, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, లెక్కలు చేయడం తప్పనిసరిగా రావాలన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు తరి రాము, శేషు, ఝాన్సీ, సుదర్శన్, ఆర్పీలు దేవేందర్, నర్సింహ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అడవిదేవులపల్లి: ప్రభుత్వం బాలికల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. మంగళవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలు విద్యపై ప్రత్యేక శ్రద్ధ ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓఎస్ నాగలక్ష్మి, టీచర్లు గీత, స్వప్న, టీనా, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించాలి

హాలియా: పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన వాదాన్ని బలపరిచే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకుల పేదలు కృషి చేయాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలేపల్లి రాజేష్ అన్నారు. మంగళవారం హాలియా పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో వేగం పెంచాలని, రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి అర్హుడికి ఆరు గ్యారంటీలు త్వరితగతిన అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు బత్తుల ప్రసాద్, సహాయ కార్యదర్శి కుక్కముడి ముత్యాలు, మహిళా కన్వీనర్ బైరాగి విజయ, తిరుమలగిరి మండల అధ్యక్షుడు అంగోతు శివనాయక్ తదితరులు ఉన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ


మాడుగులపల్లి: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

మిర్యాలగూడ: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీజీఎస్, ఏఐవైఎఫ్, డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం ఆయా సంఘాల నాయకులతో కలిసి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ఎండీ సయ్యద్, వెంకన్న, సిద్ధు, శ్రవణ్, హనుమాన్, రాంబాబు, శంకర్, రమేష్, శ్రీనివాస్, రాము, శ్రీకాంత్, ఉప్పల సురేందర్‌కుమార్, బంటు నాగేందర్, సైదాచారి, సయ్యద్ హుస్సేన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వడ్త్య రాజు, మండల అధ్యక్షుడు ఎరనాగుల సైదులు తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సంఘం మండల ప్రధాన కార్యదర్శి మోతీలాల్, సంఘం నాయకులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ: టీజీఎస్, ఏఐవైఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్..

మాడుగులపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో పీఆర్టీయూ టీఎస్ నాయకులతో కలిసి ఆ సంఘం క్యాలెండర్‌ను మండల నోడల్ అధికారి శివనేని వెంకటమ్మ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చింతకాయల రామచంద్రు, మద్దిరాల నిరంజన్‌రెడ్డి, నాయకులు అలుగుబెల్లి వేణుగోపాల్‌రెడ్డి, ఇటికాల శేఖర్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కార్లోస్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో సైన్స్ ఫేర్


ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

డిండి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు సైన్స్ ఫేర్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారుచేసిన ఎగ్జిబిట్లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, అంజయ్య, రఘునందన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా డేటా ఎంట్రీ చేయాలి

కొండమల్లేపల్లి: ప్రజా పాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని కొండమల్లేపల్లి ఎంపీడీఓ బాలరాజురెడ్డి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఫాతిమా షేక్ జయంతి వేడుకలు


మిర్యాలగూడ టౌన్: ఫాతిమా షేక్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కస్తూరి ప్రభాకర్

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ముస్లిం మైనార్టీ కళాశాలలో మొట్టమొదటి మైనార్టీ మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమూహ రైటర్స్ ఫోరం నేత కస్తూరి ప్రభాకర్, జేవీవీ నేత మౌజం హుస్సేన్ మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే స్థాపించిన పాఠశాలలో మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా ఫాతిమా షేక్ పనిచేశారన్నారు. కులమతాలకతీతంగా ఆమె స్త్రీ విద్య కోసం పాటుపడ్డారని కొనియాడారు. అనంతరం జేవీవీ నాయకుడు కొండల్‌రెడ్డి మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండ: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఫాతిమా షేక్ జయంతిని మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజా సంఘాల జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ. ఫాతిమా షేక్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేశారని, మహిళల్లో విద్యావ్యాప్తికి ఆమె చేసిన సేవలు మరువలేనివని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో చొల్లేటి భాస్కరాచారి, రాసమళ్ల నాగయ్య, పున్న శ్రీను, శ్రీరామదాసు వెంకటాచారి, గుద్దేటి సైదులు, రవీదర్‌నాయక్, నేతాల అంజయ్య, వరికుప్పల శ్రీను, కృష్ణ, నజీర్, జాని తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ


మిర్యాలగూడ టౌన్: మున్సిపల్ చైర్మన్‌కు అక్షింతలు ఇస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని షాబునగర్‌లో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ దంపతులకు మంగళవారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలు విశ్వహిందూ పరిషత్ సభ్యులు అందజేశారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, కౌన్సిలర్ ఉదయ్ భాస్కర్, మాజీ కౌన్సిలర్ మదన్ మోహన్, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకులు చెరుపల్లి కరుణాకర్, భిక్షపతి, గంజి సుధాకర్, అంకినపల్లి సుధాకర్, యామిని వెంకటేశ్వర్లు, తిప్పన వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

త్రిపురారంలో..

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి, నర్లకంటిగూడెం, బాబుసాయిపేట గ్రామాల్లో అయోధ్య అక్షింతలను మంగళవారం ఆర్ఎస్ఎస్ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఇంటింటికీ పంపిణీ చేశారు. అక్షింతలతో పాటు అయోధ్య రామమందిరం చిత్రపటం, నివేదన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో అయోధ్య అక్షింతలను అందుకున్నారు. ఈ నెల 22న ప్రతి ఇంట్లో ఇళ్ల ముందు దీపాలు వెలిగించి పూజలు చేయాలని ఆర్ఎస్ఎస్ సభ్యులు ప్రజలకు సూచించారు.

మాడుగులపల్లిలో..

మాడుగులపల్లి: మండలంలోని బొమ్మకల్ గ్రామంలో హిందూవాహిని కార్యకర్తలు మంగళవారం ఇంటింటికీ అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. అయోధ్య నుంచి పంపిన అక్షింతలకు స్థానిక రామాలయంలో పూజలు నిర్వహించి ఆంజనేయ భజన మండలి భజనలు, సంకీర్తనల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటా అందజేశారు. కార్యక్రమంలో అర్చకుడు భార్గవశర్మ, హిందూ వాహిని కార్యకర్తలు తులసిరెడ్డి, సతీష్‌రెడ్డి, సతీష్, చారి, అంజి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మిర్యాలగూడ: పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన లావూరి బిచ్చానాయక్ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు బిచ్చానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా దామరచర్ల మండలం కల్లెపల్లి గ్రామ సర్పంచ్ మాలోతు జనార్దన్ తల్లి మాలోతు రాజీ భౌతికకాయానికి, వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం గ్రామానికి చెందిన పుట్ట జానయ్య భౌతికకాయానికి కూడా ఆయన నివాళులర్పించారు. అదేవిధంగా దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామ బీఆర్ఎస్ నాయకుడు చెన్ను రాంరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, నాయకులు మేఘ్యానాయక్, పడిగపాటి పెదకోటిరెడ్డి, శ్రీనునాయక్, పాచునాయక్, లక్కిసింగ్, నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కీర్యానాయక్, దస్రునాయక్, అనిరెడ్డి నాగలక్ష్మి, చిర్ర మల్లయ్యయాదవ్, నాగమణిశేఖర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ ఆశయసాధనకు కృషి చేయాలి


శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామా శ్రీనివాస్ అకాల మరణం పద్మశాలీ సమాజానికి తీరని లోటని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పద్మశాలీ సంఘం డివిజన్ నాయకులు పున్నా రాములు, తిరందాసు వేణుగోపాల్ అన్నారు. మంగళవారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు పద్మశాలీల ఐక్యత కోసం శ్రీనివాస్ అనేక ఉద్యమాలు చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో చిలువేరు భిక్షం, కృష్ణవేణి, శ్రీనివాస్, కొంగరి నారాయణ, వాలుగుండ బ్రహ్మం, చిలుకూరి శ్రీనివాస్, జెల్లా లక్ష్మీనారాయణ, రాపోలు సత్యనారాయణ, బ్రహ్మయ్య, ప్రసాద్, చంద్రశేఖర్, రాపోలు పరమేష్, మారంగ శ్రీనివాస్, పిల్లలమర్రి రవి, బీసీ సంఘం నాయకుడు మురళి తదితరులున్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం


కిషన్‌నాయక్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: దామరచర్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ధనావత్ కిషన్‌నాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా కిషన్‌నాయక్ నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌కే హాజీ, నాయకులు కొర్ర నాగునాయక్, గాలం వెంకన్నయాదవ్, అంజిరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి మండల అధ్యక్షుడిగా వెంకన్న..



వేములపల్లి: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శెట్టిపాలెం గ్రామానికి చెందిన పెదమామ్ వెంకన్న(చంటి) ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌కే అజారుద్దీన్ చేతుల మీదుగా వెంకన్న నియామకపత్రం అందుకున్నారు.

శబరిమలకు బయల్దేరిన అయ్యప్ప మాలధారులు

అడవిదేవులపల్లి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు మంగళవారం శబరిమలకు బయల్దేరి వెళ్లారు. గురుస్వామి పెద్దింటి ఏడుకొండలు ఆధ్వర్యంలో సుమారు 40 మంది అయ్యప్ప మాలధారులు శబరిమల యాత్రకు వెళ్లారు. వెంకటేశ్వర్లు, శ్రీను, సర్వయ్య, సతీష్, పిచ్చయ్య, పద్మ, లక్ష్మమ్మ తదితరులున్నారు.

గురుస్వామికి సన్మానం

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం గురుస్వామి చిట్టెడి ప్రభాకర్‌రెడ్డిని మాలధారులు సన్మానించారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుంభం యాదగిరిగౌడ్, రాజుస్వామి, భూతరాజు సత్తయ్య, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.